

రిమ్స్‌లో ఇష్టానుసారంగా జీఎన్ఎం పరీక్షలు

రిమ్స్ వైద్య కళాశాలలో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) కోర్సుల పరీక్షలు ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. - 8లో



పేదలకు దంత వైద్యం అందించాలి

ప్రతి దంత వైద్యుడు పేదలకు వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సూచించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
30.5 /16.8

వాతావరణం

జిల్లాలో మంగళవారం 16.8 - 30.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : ఈనెల 30న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 3న సమావేశం జరపాలని తొలుత నిర్ణయించామన్నారు. అయితే పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈనెల 31 నుంచి ప్రారంభం అవుతున్నాయన్నారు. దీంతో ఎంపీలు ఈ సమావేశానికి హాజరు కాలేని పరిస్థితి ఏర్పడడంతో ఈనెల 30 న జెడ్పీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప సిటీ : జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జేసీ సాయి కాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 35 మండలాలు, ఏడు మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న 138 వలంటీర్ పోస్టుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 15న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. దరఖాస్తుల స్వీకరణకు 27 వరకు గడువు ఉందన్నారు. 28న పరిశీలన ఉంటుందన్నారు. 29, 30 తేదీలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ఓటుహక్కులో యువతను భాగస్వాములు చేయండి

– డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సిటీ : జిల్లా కేంద్రంలో ఈనెల 25 న నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవం విజయవంతం చేయాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటుహక్కులో 18 సంవత్సరాలు నిండిన యువతను తప్పక భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ దేవరాజు, ఎన్నికల సూపరింటెండెంట్ శివారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రమౌళి, మెప్మా ఏడీ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాదర్‌పల్లె టూ గల్ఫ్

ఖాదర్‌పల్లె.. ఈ ఊరి వాసులు కూలీలుగా ఉంటూ కష్టాలు అనుభవించారు. చాలీ చాలని డబ్బుతో ఇబ్బందులు పడ్డారు. ఇక ఇక్కట్ల జీవితం వద్దనుకున్నారు. ఇల్లు విడిచి అయినా సంపాదన పెంచుకోవాలనుకున్నారు. గ్రామం వదిలి గల్ఫ్ బాట పట్టారు. మెరుగైన ఉపాధి ఎంచుకున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ధీమాగా సొంతూరిలో చక్కటి ఇళ్లు కట్టుకున్నారు. అందరూ కలసి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మసీద్‌ను నిర్మించుకున్నారు. కుటుంబీకులకు ఆసరాగా ఉంటున్నారు. ఇప్పుడు ఖాదర్‌పల్లె గ్రామాన్ని పట్టణాన్ని తలపించేలా తీర్చిదిద్దారు.



- నాడు కూలీలు.. నేడు మధ్య తరగతి కుటుంబీకులు
- ఇంటింటికి ఒకరిద్దరు చొప్పున గల్ఫ్ దేశాల్లో ఉపాధి
- మారిన ఖాదర్‌పల్లె స్థితిగతులు..
- ఏడాది పొడవునా 300 మంది గల్ఫ్‌లో పనులు
- పట్టణాన్ని తలపించేలా గ్రామం..
- ఆదర్శంగా రూ.కోటితో మసీద్ నిర్మాణం



ఖాదర్‌పల్లె గ్రామం

"



ఇక్కడ కన్పిస్తున్న వ్యక్తి పేరు చాంద్ గారి మహమ్మద్ హనీఫ్. పదేళ్లుగా సౌదీలో జీవనోపాధి పొందుతున్నాడు. ఫర్నిచర్ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రతి మూడేళ్లకొకసారి స్వగ్రామానికి వచ్చి వెళతాడు. రూ.15 వేల వేతనంతో పనిలో చేరిన హనీఫ్‌కు ప్రస్తుతం రూ.40 వేలకుపైగా నెల వేతనం వస్తోంది. గతంలో మాదిరి కాకుండా ఇప్పుడు ఫోనులో కుటుంబీకులందరితో వీడియో కాల్‌లో మాట్లాడుకుంటూ ఆనందంగా పనులు చేసుకుంటున్నట్లు తెలిపాడు.



ఈ యువకుడి పేరు ఇలియాస్. రెండేళ్ల క్రితం సౌదీ వెళ్లాడు. కారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. నెలకు రూ.28 వేలు జీతం వస్తోందని.. ప్రతి ఏటా జీతం పెంచుతారని.. ఐదేళ్ల వరకూ పని చేసుకుని కుటుంబం కోసం సంపాదించుకుని వస్తానని చెబుతున్నాడు. కొత్తలో కొంచెం అయిష్టంగా ఉండేదని ఇక్కడ మా ఊరోళ్లందరూ ఉండటం వలన ప్రతి వారం కలుసుకుంటామని.. ఇప్పుడు ఆనందంగా పని చేసుకుంటున్నానని తెలుపుతున్నాడు.



ఈ యువకుడి పేరు కందనూరు మహమ్మద్. కువైట్‌లోని ఓ ఆటో స్పేర్ పార్ట్స్ దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం వెళ్లాడు. ప్రస్తుతం నెలకు రూ.40 వేలు వేతనం పొందుతున్నాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బయటి దేశంలో ఉన్నామనే ఫీలింగ్ లేకుండా ఉందని, ఇక్కడ మా సీనియర్లు చాలా మంది ఉన్నారని దీంతో ఆనందంగా పని చేస్తు కుంటున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

చాపాడు : మండల కేంద్రమైన చాపాడుకు 4 కిలోమీటర్ల దూరంలో కుందూనది ఒడ్డున ఖాదర్‌పల్లె గ్రామం ఉంది. ఈ ఊరి ప్రజలు గతంలో కూలీలుగా ఉంటూ ఎన్నో కష్టాలు పడ్డారు. మెరుగైన ఉపాధి కోసం అయినవారిని .. ఉన్న ఊరిని వదిలి గల్ఫ్ దేశాలకు పయనమయ్యారు. కువైట్, సౌదీ అరేబియా, ఖత్తర్, దుబాయి, మస్కట్ గల్ఫ్ దేశాలతో పాటు సింగ్‌పూర్ వంటి దేశాల్లో పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.

- ఈ గ్రామంలో 1499 మంది ఓటర్లు, 540 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 20 కుటుంబాలు యాదవులు కాగా మిగిలిన వారంతా ముస్లింలే ఉండడం విశేషం. ముస్లింలతోనే గ్రామం మొదలు కాగా క్రమంగా యాదవులు ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం గ్రామంలోని ప్రతి ఇంటికి ఒకరిద్దరు చొప్పున గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చిన వారే ఉన్నారు. మొదటి సారి వెళ్లిన వారు మూడేళ్లు ఆపై ఉండగా, ఇప్పటికే అనుభవం ఉన్న వారు ఏడాదికి రెండేళ్లకు ఒక సారి స్వ గ్రామాలకు వచ్చి వెళుతుంటారు. ఈ క్రమంలో ఏడాది పొడవునా 300 మంది గల్ఫ్ దేశాల్లో ఉండగా మిగిలిన 200 మంది వచ్చి వెళుతుంటారు.

1978లో ఒక్కడితే మొదలై..

ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన మహమ్మద్ దౌలా అనే వ్యక్తి 1978లో ఉపాధి కోసం బాంబెకు వెళ్లారు. అక్కడే నాలుగేళ్లు ఉండి కువైట్ బాట పట్టాడు. ఆయనతో మొదలైన గల్ఫ్ ప్రయాణం నేటి వరకూ కొనసాగుతోంది. చదివిన చదువుకు ఎంచుకున్న ఉద్యోగాల్లో అతి తక్కువ మంది ఉండగా.. 90 శాతం మంది వివిధ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

- బంగారు పని, అన్ని రకాలైన మెకానిక్ పనులు, ఫర్నిచర్ తయారీ, డ్రైవింగ్, టైలరింగ్, ఇంటి పనులు, బేల్దారి పనులు ఇలా అనేక రకాలైన పనులు చేస్తున్నారు.

95 శాతం మంది పురుషులే గల్ఫ్ దేశాలకు వెళ్లగా 5 శాతం మంది మాత్రమే మహిళలు గల్ఫ్‌లో ఉపాధి పొందుతున్నారు. కూలీ పనులు చేసుకునే కుటుంబాల వారు నేడు గల్ఫ్ దేశాల్లో నెలకు రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకూ జీతాలు పొందుతున్నారు. జీతానికి వెళ్లేవారితో పాటు అక్కడే సొంతంగా పని చేసుకుంటూ డబ్బులు సంపాదిస్తున్నారు. నాడు బోద కొట్టాలతో ఉన్న ఖాదర్‌పల్లె ప్రస్తుతం ప్రతి కుటుంబం అత్యాధునికంగా మంచి బిల్డింగ్‌లను నిర్మించుకున్నారు. జీవించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 95 శాతం కుటుంబాల వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు.



మసీద్ నిర్మాణం..

గ్రామంలో ముస్లింలందరూ డబ్బులు సమకూర్చుకుని కోటి రూపాయలతో ఇటీవల ఆదర్శంగా మసీద్‌ను నిర్మించుకున్నారు. గ్రామ ప్రజలు ఒక్కో కుటుంబం నుంచి రూ.20 వేల నుంచి రూ.5 లక్షల వరకూ మసీద్ కోసం డబ్బులు ఇచ్చారు. వీరి ఆధ్యాత్మిక బాట ఆదర్శంగా నిలుస్తోంది.

మా కుటుంబంలో ముగ్గురు సౌదీకి వెళ్లారు



మా కుటుంబంలో మొదట్లో నేను రెండేళ్లు సౌదిలో పని చేసి వచ్చాను. తర్వాత నా కొడుకు, తమ్ముడు, తమ్ముడి కొడుకు సౌదికి వెళ్లారు. నా కొడుకు పదేళ్లకు పైగా ఉండి వచ్చాడు. ప్రస్తుతం తమ్ముడు, తమ్ముడి కొడుకు ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్లుగా పని చేస్తున్నారు. అక్కడికి వెళ్లి రావటం వల్లనే మా కుటుంబాలు అభివృద్ధి చెందాయి. మొదట్లో కూలి పనులు చేసుకునే వాళ్లం. ఇప్పుడు సంతోషంగా జీవిస్తున్నాం. – సయ్యద్ నూర్, ఖాదర్‌పల్లె వాసి, చాపాడు మండలం

18 ఏళ్లు కువైట్‌లో పని చేశా



1985లో కువైట్ వెళ్లాను. యువకుడిగా పదేళ్ల పాటు కారు డ్రైవర్‌గా పని చేశాను. తర్వాత 1996లో వెళ్లి 2008లో వచ్చాను. 18 ఏళ్ల పాటు కారు డ్రైవర్‌తో పాటు ఇతర పనులు కూడా చేశాను. 2008లో ఇండియాకు వచ్చి 2009లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాను. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పార్టీలో ఉన్నాను. మా గ్రామంలో ప్రతి ఇంటి నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారే ఉన్నారు. – బొలెరో బాషా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఖాదర్‌పల్లె

గల్ఫ్ దేశాలతోనే మా గ్రామం అభివృద్ధి



1962 లో ఖాదర్ అనే వ్యక్తి వ్యవసాయ కూలీగా వలస వచ్చి గ్రామాన్ని ఏర్పాటు చేశాడు. అప్పటి నుంచి క్రమేపి పెరిగిన గ్రామంలో అందరూ వ్యవసాయ పనులు చేసుకుని జీవించే వారే. బతికేందుకు ఇబ్బందులు పడేవారు. అప్పట్లో 30 ఏళ్ల పాటు సర్పంచ్‌గా ఉన్న ఖాసీం పీరా గ్రామాభివృద్ధి కోసం పాటు పడ్డాడు. మహమ్మద్ దౌలా అనే వ్యక్తి తీసుకున్న నిర్ణయంతో 1972 నుంచి గ్రామంలోని ప్రజలు ఒక్కొక్కరుగా గల్ఫ్ దేశాల బాట పట్టారు. – వడ్ల జైనుల్లా, గ్రామ సర్పంచ్ షమీష్ ఖాను భర్త, ఖాదర్‌పల్లె

సింహ వాహనంపై నరసింహుడు

– వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చిన్న శేష వాహనంపై కడప రాయుడు మాడవీధుల్లో విహరించారు. ఉదయం వాహన సేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం సేవ నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో కనుల విందుగా ఏర్పాటు చేసిన ఊయలపై స్వామిని సేద దీర్చారు. అనంతరం సింహంపై నరసింహుడు కడప రాయుడు మలయప్పగా కొలువు దీరి భక్తులను కరుణించాడు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామి తిరుమాడవీధులలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఉదయం 10.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.00 గంటలకు ఊంజల సేవ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల కీర్తనల ఆలాపనలు, రాత్రి 8.00 గంటల నుంచి స్వామిని హనుమంత వాహనంపై ఊరేగించనున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న 19రకాల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యతా లోపం లేకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. సీఎం మెచ్చుకునేలా సకాలంలో పనులు పూర్తి చేసే విధంగా ముందుకెళ్లాలని , నిర్లక్ష్యం వహిస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హఫీజ్, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కడప సిటీ : బాల్య వివాహాలు అరికట్టడంలో అంగన్వాడీ వ్యవస్థ కీలకమైన పాత్ర పోషించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో బేటీ బచావో-బేటీ పడావోలో భాగంగా జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల నివారణలో సూపర్‌వైజర్లు సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ముదిమెల లక్ష్మీదేవి మాట్లాడుతూ బాలికల సంఖ్యను పెంచేందుకు ఏం చేయాలో వివరించారు.



పులివెందులలో అభివృద్ధి పనులపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ విజయరామరాజు

ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి మాట్లాడారు. అంతకు ముందు పోటీ పరీక్షల్లో గెలుపొందిన బాలికలకు కలెక్టర్, అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సమగ్ర శిక్ష పీడీ ప్రభాకర్‌రెడ్డి, సమగ్ర శిక్ష, ఐసీడీఎస్ సిబ్బంది, సీడీపీఓలు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర డొమెస్టిక్‌పై అవగాహన పెంపొందించాలి–

ఫిష్ ఆంధ్రలో భాగంగా డొమెస్టిక్ మార్కెటింగ్ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన తన చాంబర్‌లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకంలోని ఫిష్ ఆంధ్ర డొమెస్టిక్ మార్కెటింగ్ పథకాల అమలుపై సమన్వయ సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ చేపల డొమెస్టిక్ మార్కెటింగ్ పథకాలను త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మెప్మా, పీఆర్, జిల్లా మత్స్యశాఖ అధికారి కేఎస్‌వీ నాగలింగాచార్యులు, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ట్రాఫిక్ నిబంధనలతోపాటు తల్లిదండ్రులు కూడా సామాజిక బాధ్యత వహించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జరిగిన రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సభకు కలెక్టర్ విజయరామరాజు, శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, డీటీసీ మీరా ప్రసాద్‌లు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి వాహనాలు కనిపిస్తే సిటిజన్ పోలీసింగ్ వాట్సాప్ నెంబరు 95428 00800 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. డీటీసీ మీరా ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీఓ సుశీల, ఎంవీఐ విజయభాస్కర్, ఏఎంవీఐలు లక్ష్మీప్రసన్న, శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో మన బడి నాడు-నేడు పనుల పురోగతిపై విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో జేసీ సాయి కాంత్‌వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనాతో కలిసి కలెక్టర్ సమీక్ష చేశారు. డీఈఓ దేవరాజు, సమగ్ర శిక్ష పీడీ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాసులురెడ్డి, ఏపీఈడబ్ల్యు ఐడీసీ ఈఈ కరుణాకర్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

గండి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



గండి క్షేత్రంలో నిత్యాన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

శాశ్వత నిత్యాన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ

వేంపల్లె : జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గండి క్షేత్రంలో శాశ్వత నిత్యాన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా రూ.17కోట్ల వ్యయంతో చేపట్టిన ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, అర్చకులు రాజాస్వాములు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ.. గండి వీరాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలయ పునఃనిర్మాణానికి రూ.17కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయానికి ఫండ్ క్రియేట్ చేసి అన్నదాన ట్రస్ట్ ద్వారా రోజు 200 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ పథకానికి అందరి సహకారం అందించాల్సిందిగా కోరారు. నిత్యాన్నదాన పథకం ప్రారంభించిన అనంతరం భక్తులకు ఎంపీ భోజనం వడ్డించారు. అలాగే చక్రాయపేటలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు శివప్రసాద్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఎంపీపీలు మాధవీ బాలకృష్ణ, లక్ష్మీగాయత్రి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్‌ల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సర్పంచ్‌లు నరసింహులు, హర్షద్, ఏపీ టూరిజం డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, సమన్వయకర్త ఓబుళరెడ్డి, పాలక మండలి సభ్యులు లోమడ రామాంజనేయ రెడ్డి, సీఐ గోవింద్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో లుకలుకలు!

- తెలుగు తమ్ముళ్ల మధ్య ముదిరిన విభేదాలు
- నారా లోకేష్ పర్యటనలో మరోమారు బహిర్గతం
- కడప పార్లమెంట్ అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు పరస్పర విరుద్ధ నిర్ణయాలు
- పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఒకరిపై సస్పెన్షన్ వేటు
- రెండు రోజులు తిరక్కమునుపే లోకేష్ పర్యటన సమన్వయ బాధ్యతలు
- రూట్ మ్యాప్ సైతం ఆలంఖాన్‌పల్లె మీదుగా రద్దు



నంద్యాల వరప్రసాద్‌రెడ్డికి సమన్వయ బాధ్యతలు అప్పగిస్తూ నియామకపు పత్రాన్ని అందిస్తున్న పొలిట్ బ్యూరో శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప : 'ఎడ్డెమంటే తెడ్డెం అన్నట్లుగా ఒకరు ఒక సూచన చేస్తే మరొకరు ఇంకో నిర్ణయం అమలు చేయాలని పట్టుబట్టడం, అలాకాకాదు, ఇలాగే కొనసాగించాలని ఇంకొకరు' ఇది ప్రస్తుతం తెలుగు తమ్ముళ్ల తీరు. ఒకరంటే ఇంకొకరికి అస్సలు పడడం లేదు. జిల్లా మొత్తానికి ముగ్గురు నాయకులుంటే మూడు గ్రూపులు ఆరు వర్గాలుగా వ్యవహరిస్తున్నారు. విభేదాలు ముదిరిపోయి నారాలోకేష్ పర్యటన సందర్భంగా బహిర్గతం అయ్యాయి. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని రెండు రోజుల క్రితం జిల్లా అధ్యక్షుడు సస్పెండ్ చేస్తే, అదే వ్యక్తికి లోకేష్ పర్యటన సమన్వయ బాధ్యతలు అప్పగిస్తూ పొలిట్‌బ్యూరో సభ్యుడు నిర్ణయించారు. కడప రూట్ మ్యాప్ సైతం అప్పటికప్పుడు మారిపోయింది. ముందుగా నిర్ణయించిన ఆలంఖాన్‌పల్లె గ్రామం గుండా కాకుండా రింగు రోడ్డు వెంబడి వెళ్లే విధంగా సాయంత్రానికి తారుమారైంది. వెరశి ఎవరి స్థాయిలో వారు పైచేయి సాధించాలనే తత్వాన్ని ప్రదర్శిస్తుండడంతో లుకలుకలు బహిర్గతమౌతున్నాయి.

- తెలుగుదేశం పార్టీ జిల్లాలో జవసత్వాలు కోల్పోయింది. సాధారణ ఎన్నికల నుంచి స్థానిక సంస్థల ఎన్నికల వరకూ కనీస ఉనికి కాపాడుకోలేకపోయింది. ఈపరిస్థితిలో రాబోవు ఎన్నికల్లోనైనా పట్టు సాధించాలనే దిశగా అధినాయకత్వం ప్రయత్నిస్తోండగా జిల్లాలో వర్గపోరుతో తలబొప్పి కట్టే చర్యలకు తెలుగు తమ్ముళ్లు దిగుతున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా ఒకరి నిర్ణయానికి మరొకరు వ్యతిరేకంగా వ్యవహరించడాన్ని తెలుగుతమ్ముళ్లు బాహాటంగా చెప్పుకొస్తున్నారు.

లింగారెడ్డి సస్పెండ్ చేస్తే... వాసు నియమించారు...

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని జమ్మలమడుగు నియోజకవర్గం పొట్లదుర్తి గ్రామానికి చెందిన క్రియాశీలక కార్యకర్త నంద్యాల వరప్రసాద్‌రెడ్డి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఈనెల 22న పార్లమెంటు అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అదే వ్యక్తికి 24వ తేదిన టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం కడప జిల్లా పర్యటనకు సంబంధించిన సదుపాయాలు కల్పనతోపాటు, సమన్వయ బాధ్యతలు అప్పగిస్తూ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఆమేరకు నియామకపత్రాన్ని నంద్యాల వరప్రసాద్‌రెడ్డికి అప్పగించారు. ఒక వ్యక్తి విషయంలోనే పరస్పర విరుద్ధ నిర్ణయాలు తెరపైకి రావడంతో తెలుగుతమ్ముళ్ల మధ్య ఉన్న విభేదాలు స్పష్టమౌతున్నాయి.

సీనియర్లకు దక్కని గౌరవం...

నిన్నమొన్నటి క్రియాశీలక కార్యకర్తకు లభించిన గౌరవం సీనియర్లకు దక్కలేదనే టాక్ జిల్లాలో విస్తృతమైంది. పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాలలో కొనసాగిన కార్య నిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, 2009 నుంచి టీడీపీ ఉన్నతి కోసం పనిచేసిన రాష్ట్ర కార్యదర్శి సాయినాథ్‌శర్మల సస్పెన్షన్ విషయాన్ని పలువురు ఎత్తి చూపుతున్నారు. ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిగా ఉన్న నాయకుల ఫిర్యాదు మేరకు 2022 సెప్టెంబర్27న సస్పెన్షన్ చేశారు. ఇప్పటికీ కనీస విచారణ చేపట్టలేదు. దీనిని బట్టి జిల్లాలో టీడీపీ పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

లక్ష్మీరెడ్డికి కట్టడి...

నారా లోకేష్ జిల్లా పర్యటనలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీరెడ్డి కుటుంబం ఫోకస్ కాకుండా కట్టడి చేశారు. ఎయిర్‌పోర్టులో దిగిన లోకేష్ ఆలంఖాన్‌పల్లె మీదుగా పెద్దదర్గా చేరుకునేలా ముందుగా నిర్ణయం తీసుకున్నారు. ఆమేరకు లక్ష్మీరెడ్డి కుటుంబ సభ్యులు భారీగా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఆలంఖాన్‌పల్లె లో లోకేష్‌కు ఘన స్వాగతం పలకాలనే దిశగా ఉండిపోయారు. ఈ విషయాన్ని గ్రహించిన టీడీపీ నేతలు ఆలంఖాన్‌పల్లె మీదుగా కాకుండా రింగ్ రోడ్డు వెంబడి దేవుని కడప చేరుకునేలా.. అక్కడి నుంచి పెద్దదర్గా చేరుకునే రూట్‌మ్యాప్ పునః నియమించారు. ఆమేరకు అధికారికంగా రూట్ మ్యాప్ ఖరారు చేయించుకున్నారు. 'ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం' అన్నట్లుగా ఏమి లేకపోయినా తెలుగు తమ్ముళ్లు ఎదుటివారిని కట్టడి చేయడంలో తలమునకలై ఉన్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

నేడు నారా లోకేష్ జిల్లా పర్యటన

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం జిల్లా పర్యటనలో స్వల్ప మార్పులు జరిగాయి. ఆయన హైదరాబాద్ నుంచి సాయంత్రం 4.45 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గాన 5.10 గంటలకు దేవుని కడప శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చేరుకుంటారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం 5.40 గంటలకు అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) చేరుకొని ప్రార్థనలు నిర్వహిస్తారు. తరువాత 6.15 గంటలకు మరియాపురం రోమన్ క్యాథలిక్ కేథిడ్రల్ చర్చిలో నిర్వహించే ప్రార్థనల్లో పాల్గొంటారు. అనంతరం తిరుమలకు వెళతారని ఆ పార్టీ శ్రేణులు తెలిపాయి.




మురిపించే బంతి.. చామంతి

'బంతి, చామంతి ముద్దాడుతున్నాయిలే' – అనే పాట వినే ఉంటారుగా! బంతి జాతి మొక్కే ఇదీనూ. వర్ష రుతువుకు వీడ్కోలు పలుకుతూ మొగ్గ తొడిగి, ముద్దు ముద్దుగా మురిపిస్తున్నాయి ఈ పుష్పాలు. శరదృతువు వెన్నెల్లో విర బూసి, హేమంతంలో మంచు బిందువులతో ఊసులాడుతూ కనువిందు చేస్తున్నాయి. ప్రకృతిని పరవశింప జేస్తున్నాయి. గులాబీల తర్వాత ఎక్కువ రంగులు, రకాలు ఉండటం ఈ పూల ప్రత్యేకం. ఇటు సుగంధాలను అటు ఆనందాలను పంచుతోంది. మనస్సుకు ఆహ్లాదాన్ని, ఉత్సాహాన్ని ఇస్తోంది. ఈ సుందర దృశ్యం కడప నగర సమీపంలోని సిద్దవటం మండలం మాచుపల్లె పొలాల్లో కనిపిస్తోంది.

– ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప

కలువల కనువిందు




పెద్ద సాగునీటి ప్రాజెక్ట్ కాలువలో అర విరిసిన పద్మాలను చూస్తుంటే మనసుకెంతో హాయి. మరి విచ్చుకున్న వేల తామరలు కాలువంతా కనువిందు చేస్తుంటే.. గులాబీ వన్నెలతో రారమ్మని ఆహ్వానిస్తుంటే.. ఆ దృశ్యం అపురూపం కదా! ఎర్రగుంట్ల మండల పరిధిలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు సమీపాన మేకలబాలయపల్లె, కే గోవులాపురం గ్రామాల మధ్య ఉన్న మైలవరం రిజర్వాయర్ దక్షిణ కాలువలో ఉంది. కనుచూపు మేర కనిపించే పూలసోయగాలు స్థానికులు, ప్రయాణికుల మదిని దోచుకుంటున్నాయి. వారు విరబూసిన కలువల అందాలను తమ కెమెరాలు, హృదయాల్లో పదిల పరుచుకుంటున్నారు.

– ఎర్రగుంట్ల

ఎస్‌సీఈఆర్టీ అసెస్‌మెంట్ సెల్‌కు ఎంపిక


గంగరాజు

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య శిక్షణ పరిశోధన సంస్థ అసెస్‌మెంట్‌కు(సాంఘిక శాస్త్రం) సెల్‌కు తొండూరు మండలం అగడూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పని చేసే సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గంగరాజు ఎంపికైయాడు. అసెస్మెంట్ సెల్‌లో డిప్యూటేషన్‌పై పని చేయుటకు ఎస్‌సీఈఆర్టీ వారు డిసెంబర్ 11న నిర్వహించిన పరీక్షల్లో ఆయన ప్రతిభను చాటాడు. ఆ తరువాత జనవరి 4న విజయవాడలో నిర్వహించిన ఇంటర్వ్యూలో కూడా తమ ప్రతిభను చాటి అసెస్మెంట్ సెల్‌కు ఎంపికైయాడు. ఈయన పరీక్షా పత్రాల మూల్యాంకనం, ఫలితాల సరళి వంటి విషయాలపై పరిశీలన చేస్తారు. ఎస్‌సీఈఆర్టీ అసెస్‌మెంట్ సెల్‌కు ఎంపికైన గంగరాజుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు అభినందనలు తెలిపారు.

పులివెందుల పెద్దమ్మ.. జయమ్మ

- సర్పంచ్‌గా, రోటరీ క్లబ్ ద్వారా సమాజ సేవ
- అందరి కష్టంలో పాలుపంచుకున్న వైనం
- నేడు వైఎస్ జయమ్మ వర్ధంతి


భర్త వైఎస్ రాజారెడ్డితో వైఎస్ జయమ్మ(ఫైల్)


మహానేత వైఎస్ఆర్‌తో వైఎస్ జయమ్మ(ఫైల్)

పులివెందుల : అడగందే అమ్మ అయినా అన్నం పెట్టదంటారు.. కానీ అడగకుండానే అన్నం పెట్టి, ప్రజల కష్టాలు తీర్చి పులివెందుల పెద్దమ్మగా కీర్తి పొందారు వైఎస్ జయమ్మ. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాతృమూర్తి వైఎస్ జయమ్మ. ఆమె జీవించి ఉన్నంత కాలం పులివెందులకు సంబంధించిన ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ దాన, ధర్మాలలో మునిగిపోయేది. 2003లో వైఎస్ఆర్ ప్రజల కష్టసుఖాలను తెలుసుకొనేందుకు పాదయాత్ర చేసిన సందర్భంలో తల్లిగా వైఎస్ జయమ్మ కుమిలిపోతూనే.. బిడ్డకు మంచి జరగాలని రోజూ ప్రార్థించేది. 1999 ప్రాంతంలో విపరీతమైన కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రజలకు పట్టెడు అన్నం పెట్టాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రోజూ ఐదారు వందల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించి ప్రశంసలు అందుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే వైఎస్ జయమ్మ జీవించినంత కాలం ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తూ పులివెందుల పెద్దమ్మగా గుర్తింపు పొందారు. కాగా 1995 నుంచి 2000 వరకు పులివెందుల సర్పంచ్‌గా పని చేశారు. అప్పటి ప్రభుత్వం నుంచి ఉత్తమ సర్పంచ్ అవార్డుతోపాటు పంచాయతీని ఆదర్శంగా నిలిపి ఉత్తమ పంచాయతీ అవార్డును సైతం సొంతం చేసుకున్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం కావాలన్న చిరకాల వాంఛ నెరవేరిన తర్వాత 2006 జనవరి 25న వైఎస్ జయమ్మ తుదిశ్వాస విడిచారు. ఆమె మరణించి నేటికి (బుధవారం) సరిగ్గా 17 ఏళ్లు అవుతోంది.

నేడు వైఎస్ జయమ్మ వర్ధంతి

దివంగత వైఎస్ రాజారెడ్డి సతీమణి వైఎస్ జయమ్మ 17వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం పులివెందులలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ కుటుంబ సభ్యులు పాలు పంచుకుంటారు. వైఎస్ జయమ్మ సమాధి వద్ద ప్రార్థనలతోపాటు జయమ్మ పార్క్ వద్ద ఉన్న జయమ్మ విగ్రహం వద్ద నివాళులర్పించనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు వైఎస్ఆర్ అభిమానులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

రిమ్స్‌లో ఇష్టారాజ్యంగా జీఎన్ఎం పరీక్షలు

- ప్రైవేట్ యాజమాన్యంతో కొందరు ఉద్యోగుల కుమ్మక్కు
- ప్రతి విద్యార్థి నుంచి 7 నుంచి 8 వేల రూపాయలు వసూలు


కడప రిమ్స్ వైద్య కళాశాల

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) వైద్య కళాశాలలో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) కోర్సుల పరీక్షలు ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు ఈనెలాఖరు వరకు జరుగుతాయి. దాదాపు 700 మంది విద్యార్థులు రాస్తున్నారు. కడప నగరంతోపాటు, ఇతర ప్రాంతాలలో వున్న ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న వారు కూడా హాజరవుతున్నారు. రిమ్స్‌లోని కొందరు అధికారులు, ఉద్యోగులతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు కుమ్మక్కై.. తమ విద్యార్థులు సులువుగా రాసేందుకు, మాస్ కాపీయింగ్‌కు పాల్పడేందుకు సన్నాహాలు చేసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం అభ్యర్థుల నుంచి కొందరు ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల యాజమాన్యం ఒక్కో విద్యార్థి నుంచి దాదాపు 7 నుంచి 8 వేల రూపాయలను వసూలు చేసినట్లు సమాచారం. ఈ డబ్బులను ఈ పరీక్షలకు విజయవాడ నుంచి వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ నుంచి వచ్చే వారిని, కడప రిమ్స్‌లో కుమ్మక్కైన కొందరు అధికారులను 'మేనేజ్' చేయడానికి వసూలు చేశారని విశ్వసనీయ సమాచారం. అధికారులు, ఉద్యోగులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహిస్తే బాగుంటుందని కొందరి విద్యార్థుల అభిప్రాయం. ఈ పరీక్షల నిర్వహణపై కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖను వివరణ కోరగా... వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి వచ్చే అధికారుల పర్యవేక్షణలో జీఎన్ఎం పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రశ్నాపత్రాల కోడింగ్, ఇతరత్రా అంశాలన్నీ ఆయా అధికారులే చూసుకుంటారన్నారు. తాము కళాశాలలో పరీక్షల నిర్వహణకు సంబంధించి గదుల కేటాయింపు, ఇన్విజిలేటర్లను నియమిస్తామన్నారు. ఈ పరీక్షలను అన్ని రకాలుగా పకడ్బందీగా నిర్వహిస్తామనీ తెలియజేశారు.

సైన్స్ ఒలంపియాడ్‌లో గోల్డ్‌మెడల్


శ్రీవల్లి


పూర్విక‌

పులివెందుల : సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన సాఫ్ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలంపియాడ్ విభాగంలో పులివెందులకు చెందిన విద్యార్థులు వంగల శ్రీవల్లి, తమ్మిశెట్టి పూర్వికలు గోల్డ్ మెడల్స్ సాధించారు. పట్టణంలోని స్వామి వివేకానంద పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న వీరు ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ విభాగంలో జరిగిన పరీక్షలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిలో ద్వితీయన స్థానం సాధించి గోల్డ్ మెడల్‌తోపాటు సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ద్వారా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వారి తల్లిదండ్రులు, పాఠశాల కరస్పాండెంట్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

17 పతకాలు కైవసం


పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రత్యేకాధికారి ఎస్.బాషామోహిద్దీన్

కడప స్పోర్ట్స్: ఈ నెల 20, 21 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించిన 66వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో 17 పతకాలు సాధించి సత్తా చాటారు. వీరిని వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ అభినందించారు. చక్కటి శిక్షణ ఇచ్చిన అథ్లెటిక్స్ శిక్షకులు కె. వంశీధర్, పి.వెంకటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో ఖేలోఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మేనేజర్ కె. శ్రీనివాస సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఖిద్మత్ బ్యాంకు ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ఖిద్మత్ బ్యాంక్ శాఖ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేద వర్గాల అభివృద్ధి కోసం జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో సామాజిక సేవలో భాగంగా లాభాపేక్ష లేకుండా వడ్డీ రహిత ఖిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ శాఖను ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జిన్నా రోడ్డులో ఏర్పాటు చేసిన ఖిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖురాన్ గ్రంథంలో మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను అనుసరించి దానధర్మాలు చేయాలన్నారు. ఇందులో భాగంగానే జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో సొసైటీని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫిక్ మాట్లాడుతూ ఈ సొసైటీని 2017లో ప్రారంభించామని, రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకలో 40 బ్రాంచీలు ఉన్నాయన్నారు. ఏపీలో 8వ బ్రాంచిగా ప్రొద్దుటూరులో శాఖను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, సొసైటీ రాష్ట్ర మీడియా కార్యదర్శి అక్బర్‌బాషా, అబ్దుల్ కుద్దీస్, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు అక్రమ్ మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు ఇర్ఫాన్ బాషా, కమాల్ బాషా, వెల్లాల మహ్మద్ గౌస్, జమాతె ఇస్లామి హింద్ పట్టణాధ్యక్షుడు షరీఫ్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

చెక్క భజన గురువుకు అవార్డు ప్రదానం


శివ నంది అవార్డును అందుకుంటున్న చెక్క భజన గురువు సామేల్

వల్లూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లెకు చెందిన చెక్క భజన గురువు దరిశా సామేల్‌కు నిర్వాహకులు శివ నంది అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణా రాష్ట్రంలోని కోదాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 22న శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా నేషనల్ లెవెల్ డ్యాన్స్ ఫెస్టివల్ – 13 ను నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వల్లూరు మండలంలోని నల్లపురెడ్డిపల్లెకు చెందిన చెక్క భజన గురువు సామేల్ తన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. దీంతో నిర్వాహకులు ఆయనకు శివ నంది అవార్డును ప్రకటించారు. ఈ మేరకు కార్యక్రమం ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదాడ ఎమ్మెల్యే బీ మల్లయ్య యాదవ్ చేతుల మీదుగా అవార్డును, సర్టిఫికెట్‌ను అందజేశారు. చెక్క భజన గురువుగా తన ప్రతిభను చాటిన ఆయనను పలువురు అభినందించారు.

పేదలకు దంత వైద్యం అందించాలి


స్నాతకోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప అర్బన్ : దంత వైద్య విద్య పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి మార్గదర్శకులవుతారని, ప్రతి దంత వైద్యుడు పేదలకు దంత వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం కడప నగర శివారులోని శిల్పారామంలోని అమిగోస్ కన్వెన్షన్ హాల్‌లో ప్రభుత్వ దంతవైద్య కళాశాల పదవ స్నాతకోత్సవంను ఘనంగా నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న 2017 బ్యాచ్ వారు తమ తల్లిదండ్రులు, బంధువులతో ఉత్సాహంగా గడిపారు. ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వ దంతవైద్యశాలలో ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. వచ్చే నెలలో 'మొబైల్ డెంటల్ వ్యాన్' సహాయంతో వైఎస్ఆర్ చిరునవ్వుతో పథకం ప్రారంభించబోతున్నామన్నారు. దీని ద్వారా గ్రామాలకు వెళ్లి పిల్లల దగ్గరి నుంచి పెద్దల వరకు దంతవైద్య సేవలను అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ నరేంద్రదేవ్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ కోటయ్య, డాక్టర్ వజ్రమాధురిల చేతులమీదుగా గ్రాడ్యుయేషన్ పట్టాలను, మెడల్స్‌ను అందజేశారు. ఈ వేడుకల్లో కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఎస్పీ రాఘవేంద్రకు అదనపు ఎస్పీగా పదోన్నతి

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో డీఎస్పీలుగా పని చేస్తున్న 18 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను కల్పిస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఈ జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో జిల్లాలో కడపలోని ఇంటలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పని చేస్తున్న ఆర్.రాఘవేంద్రకు అదనపు ఎస్పీ పదోన్నతి కల్పించారు.

హత్య కేసులో బాలుడికి మూడేళ్ల పర్యవేక్షణ

కడప అర్బన్ : జిల్లాలో ప్రొద్దుటూరుకు చెందిన నూర్‌బాషా కుమారుడు ముస్తఫా (16)ను కడపలోని ప్రభుత్వ బాలుర పర్యవేక్షక గృహంలో 2016 అక్టోబర్ 20న మరో బాలుడు టవల్‌తో బిగించి చంపేశాడు. ఈ సంఘటనపై అప్పటి కడప ఒన్‌టౌన్ సీఐ కె. రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాడు. ఈ నేరం రుజువు కావడంతో కడపలోని జువైనల్ జస్టిస్‌బోర్డ్‌లో నిందితుడు మూడేళ్ల పాటు తిరుపతి పర్యవేక్షక గృహంలో వుండాలని మెజిస్ట్రేట్ తీర్పును ఇచ్చారు. ఈ మేరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ ఖాదర్‌బాషా నేరం రుజువయ్యేందుకు తమ వంతుగా కృషి చేశారు. ఈ కేసు వివరాలను కడప ఒన్‌టౌన్ ఎన్.వి నాగరాజు వివరాలను తెలియజేశారు.

సిద్దవటం పశువైద్యశాల తనిఖీ


పశువుకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి శారదమ్మ

సిద్దవటం : సిద్దవటంలోని పశు వైద్యశాలను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ సి.శారదమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. పశువైద్యశాలలో సేవలు ఎలా ఉన్నాయి, డాక్టర్ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయా అనే విషయాన్ని ఆమె వైద్య శాలకు వచ్చిన పాడి రైతులను అడిగి తెలుసుకున్నారు. జబ్బులు సోకి పశు వైద్యశాలకు వచ్చిన పశువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో నియమితులైన పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లకు పశువైద్యశాలలో 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అందులో భాగంగా వారి పనితీరు పట్ల పరిశీలించేందుకు తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆవులకు, గేదెలకు పల్లె ప్రాంతాల్లో కృత్రిమ గర్భాధారణ అనే విషయంపై పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లకు శిక్షణ ఎంత మేరకు ఇస్తున్నారు అనే విషయంపై పరిశీలించడం జరిగిందన్నారు. పాడి రైతులకు ఓ కొత్త సమాచారాన్ని తెలియజేస్తున్నామన్నారు. ఆవులకు ఆవుదూడలను పుట్టించే కార్యక్రమం వచ్చిందని, ఆ సూది ప్రభుత్వం ధర రూ.1,350 అవుతుందని, పాడి రైతులకు సబ్సిడీ తీసి వేయగా రెండు సూదులు రూ.500 అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, అసిస్టెంటు డైరెక్టర్ శ్రీనివాసులు, సిద్దవటం పశువైద్యశాల అసిస్టెంటు డైరెక్టర్ సుబ్బరాయుడు, సూపరింటెండెంట్ చంద్ర, లైవ్‌స్టాక్ అసిస్టెంటు జిలానీ బాషా, అసిస్టెంటు క్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

డీకేటీ భూమి విషయమై రాళ్లతో దాడులు

- ఆరుగురికి గాయాలు
- ఇరు వర్గాలపై కేసులు నమోదు

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలం గంగులనారాయణపల్లె గ్రామంలో డీకేటీ భూమి విషయమై ఇరు వర్గాల వారు రాళ్లతో దాడులు చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకొంది. జమ్మలమడుగు రూరల్ సీఐ టి.వి. కొండారెడ్డి ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం గంగులనారాయణపల్లె గ్రామంలో కొన్ని సంవత్సరాల నుంచి కొండయ్య వారి బంధువులు డీకేటీ భూమిని సాగుచేసుకొంటున్నారు. మరొక వర్గం అయిన రమేష్ వారి బంధువులు దాదాపు 20 సంవత్సరాల నుంచి గ్రామం విడిచి మండలంలోని మద్దిలేటిపల్లె తదితర గ్రామాల్లో ఉన్నారు. మంగళవారం కొండయ్య వారి బంధువులు భూమిని సాగుచేసుకుంటుండగా మద్దిలేటిపల్లె, తదితర గ్రామాల నుంచి సుమారు 10 మందికి పైగా గంగులనారాయణపల్లె గ్రామానికి చేరుకుని ఘర్షణ పడ్డారు. ఇరు వర్గాల వారు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో కొండయ్య, కుమారుడు బాల కొండయ్య, చిన్నాయన కుమారుడు శంకర్, మరో మహిళకు గాయాలు కాగా.. మరో వర్గానికి చెందిన రమేష్, వెంకటసుబ్బమ్మకు గాయాలైనవి. వెంటనే విషయం తెలుసుకున్న సి.ఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలసి గ్రామానికి చేరుకున్నారు. ఇరువర్గాల వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం గాయపడిన వారిని జమ్మలమడుగుప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తున్నామని సీఐ తెలిపారు.

హెల్మెట్, సీటు బెల్ట్‌లు ధరించండి

కడప అర్బన్ : హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌పై ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామ సభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు తదితర అంశాలతోపాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అందరూ తమవంతు సామాజిక బాధ్యతగా భావించి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 242 కేసులను నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ లేని కేసులు 397, సీట్ బెల్ట్ ధరించని వారిపై 25 కేసులు నమోదు చేశారు.